క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన నగర కమిషనర్



కలెక్టర్‌కు మొక్కను అందిస్తున్న భానుప్రతాప్

ఏలూరు(మెట్రో) : ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్‌గా ఎ.భానుప్రతాప్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ కె.వెట్రి సెల్వీని మర్యాదపూర్వకంగా కలిసి, పూల మొక్కను అందజేశారు. ఏలూరు నగర పాలక సంస్థ ద్వారా పట్టణాభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కమిషనర్ భాను ప్రతాప్‌కు కలెక్టర్ సూచించారు.

నేడు ఎస్సీ కమిషన్ సభ్యుడు ఆనందప్రకాష్ రాక

ఏలూరు (టూటౌన్) / ఏలూరు(మెట్రో) : రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనంద ప్రకాష్ ఆదివారం ఏలూరు రానున్నారు. జిల్లా పరిషత్ అతిథి గృహంలో ఎస్సీ, ఎస్టీ ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారు. ఉదయం 10.30 గంటలకు విలేకర్ల సమావేశం నిర్వహిస్తారు. అనంతరం వట్లూరులోని గురుకుల పాఠశాలను సందర్శిస్తారని జిల్లా సమాచార శాఖ అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు లక్‌పతి దీదీస్

ఏలూరు(మెట్రో) : మహారాష్ట్రలోని జలగాన్ గ్రామంలో ఈ నెల 25వ తేదీ ఆదివారం లక్‌పతి దిదీస్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులు తెలిపారు. ఉదయం 11 గంటలకు నూరు రోజుల క్యాంపెయిన్ వ్యవస్థాపక డెవలప్‌మెంట్ లక్‌పతి దిదీస్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమం ఏలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహిస్తారని, కలెక్టర్ కె.వెట్రిసెల్వి తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు.

41 నోటీసు నిబంధనలు తొలగించాలి

ఏలూరు (టూటౌన్): ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కేసుల్లో 41 నోటీసు నిబంధనలు తొలగించి ముద్దాయిలను వెంటనే అరెస్టు చేసేలా ఆర్డినెన్స్ తెచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ అఖిల భారత తపాలా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు దాసరి నాగేంద్ర కోరారు. ఈ మేరకు ఢిల్లీలోని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జతుతో హుస్సేన్, ఎస్సీ కమిషన్ జాతీయ సభ్యులు వి.రామ్ చందర్‌లను శనివారం కలిసి వినతి పత్రాలను అందజేశారు. అఖిల భారత తపాలా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి అహిర్వార్, నాయకులు దాసి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

26 నుంచి ఆటల పోటీలు

ఏలూరు రూరల్ : ఈ నెల 29వ తేదీ జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు ఆటల పోటీలు నిర్వహించనున్నామని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి బి.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26వ తేదీ నుంచి 28వ తేదీ వరకు ఈ పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఏలూరు ఇండోర్‌స్టేడియం, అల్లూరి సీతారామరాజు స్టేడియంలో వాకింగ్, వాలీబాల్, హాకీ, మినీ పుట్‌బాల్, టెన్నిస్‌బాల్ క్రికెట్, ఇన్‌డోర్ విభాగంలో బాడ్మింటన్, చెస్, బాస్కెట్‌బాల్, టిటి, టగ్ ఆఫ్ వార్ అంశాల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. ఫన్ యాక్టివిటీస్ విభాగంలో లెమెన్ రేస్, రోప్ జంపింగ్, ఖోఖో, లగోరీ, ప్లాంగ్ చాలెంజ్ అంశాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు 29వ తేదీన సర్టిఫికెట్లు అందిస్తామని, జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులను సత్కరిస్తామని తెలిపారు. ఈనెల 30, 31 తేదీల్లో జిల్లా విద్యాశాఖ సౌజన్యంతో పాఠశాలల్లో పిల్లలకు క్రీడలపై క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామని వివరించారు.

7,613 మెట్రిక్ టన్నుల ఇసుక సరఫరా

ఏలూరు(మెట్రో): జిల్లాలో శనివారం మూడు బుకింగ్ సెంటర్ల ద్వారా 1,526 మెట్రిక్ టన్నుల ఇసుకను సరఫరా చేసినట్టు మైనింగ్ డీడీ సునీల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సెంటర్లలో 86 ఆర్డర్లు నమోదు కాగా అన్నింటికీ ఇసుక సరఫరా చేశామని పేర్కొన్నారు. జిల్లాలో ఇంతవరకు మొత్తం 7,613 మెట్రిక్ టన్నుల ఇసుక వినియోగదారులకు సరఫరా చేశామని తెలిపారు. ఇబ్రహీంపేట స్టాక్ పాయింట్ వద్ద మెట్రిక్ టన్నుకు రూ.210, చేబ్రోలు స్టాక్ పాయింట్ వద్ద రూ.538, వింజరం స్టాక్ పాయింట్ వద్ద టన్నుకు రూ.362కు ఇసుకను సరఫరా చేశామని వివరించారు. గ్రీవెన్స్‌కు అందిన ఒక ఫిర్యాదును పరిష్కరించామని తెలిపారు.

భర్త, అత్తలపై వేధింపుల కేసు

ఏలూరు టౌన్: ఏలూరు సత్రంపాడు ప్రాంతంలో భార్యను అదనపు కట్నం కోసం వేధిస్తోన్న భర్త, అత్తలపై ఏలూరు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఏలూరు సత్రంపాడు అంబేద్కర్ నగర్‌కు చెందిన గోరింక సువర్ణరాణి, సురేషకుమార్‌కు ఏడాది క్రితం వివాహమైంది. వీరిద్దరూ ప్రైవేటు ఉద్యోగాలు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. ఇటీవల భార్యను అదనపు కట్నం తేవాలంటూ భర్త వేధింపులకు గురి చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి భర్త, అత్త ఇద్దరూ భార్య సువర్ణరాణిని కొట్టటంతో ఆమె ఏలూరు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు భర్త, అత్తలపై కేసు నమోదు చేశారు.



మహిళా వైద్యుల భద్రతకు చర్యలు



ప్రజలకు సేవ చేయాలనే తపనతో వైద్యవృత్తిలోకి ప్రవేశించే మహిళా వైద్యులు, నర్సింగ్ సిబ్బందికి ప్రతి ఒక్కరూ అండగా ఉండాలి. కోల్‌కత్తాలో జరిగిన దారుణఘటనను ప్రజలంతా ఖండిస్తున్నారు. ప్రజా సంఘాలు, వైద్య సంఘాలు ఇలాంటి దారుణాలు మరోసారి చోటుచేసుకోకుండా తమ నిరసనలు తెలుపుతున్నారు. ఏలూరు జీజీహెచ్‌లో మహిళా వైద్యుల భద్రతకు అధికారులు చర్యలు చేపట్టారు. ఏలూరు జీజీహెచ్‌లో సీసీ కెమెరాల నిఘాతో పాటు సెక్యూరిటీ సిబ్బందిని నియమించారు. స్వేచ్ఛగా తమ విధులను నిర్వర్తించేలా చర్యలు తీసుకుంటున్నారు. – డాక్టర్ రవికుమార్, జనరల్ సర్జన్, ఏలూరు జీజీహెచ్

వైద్యుల రక్షణ ప్రభుత్వాల బాధ్యత




వైద్య వృత్తిలోకి ప్రవేశిస్తోన్న యువ మహిళా వైద్యులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. ప్రతి హాస్పిటల్‌లోనూ మహిళా వైద్యులకు భద్రత ఇస్తేనే వారు స్వేచ్ఛగా వైద్యసేవలు అందించగలరు. మహిళల పట్ల వివక్షత తగ్గాలి, నేరాలకు పాల్పడే వ్యక్తులకు కఠిన శిక్షలు విధిస్తేనే వారిలో భయం వస్తుంది. ఎలాంటి అనారోగ్యంతో బాధపడుతున్నా రోగులకు చికిత్సలు అందించేందుకు వైద్యులు సిద్ధంగా ఉంటారు. కోల్‌కత్తాలోని ఘటనతో మహిళా వైద్యులు తమ వృత్తి బాధ్యతను నిర్వర్తించేందుకు భయపడే పరిస్థితి ఏర్పడుతుంది. ప్రభుత్వాలు భరోసా కల్పించేలా చర్యలు చేపట్టాలి. – బి.నిర్మల కుమారి, ఉపాధ్యాయురాలు, ఏలూరు

నిరుపయోగంగా ఆక్సిజన్ ప్లాంట్లు

- రూ.2.50 కోట్లతో గతంలో ఏర్పాటు
- భారత్ కంపెనీకి నెలకు రూ.5 లక్షల వరకు ఖర్చు
- కూటమి ప్రభుత్వంలో నిర్వహణ గాలికి

ఏలూరు టౌన్ : ఏలూరు సర్వజన ఆసుపత్రిలో ఒకవైపు ప్రజలకు సరైన వైద్య సేవలు అందే పరిస్థితి కనిపించకపోగా, మరోవైపు ప్రజా ధనం వృథాగా ప్రైవేటు కంపెనీలకు కట్టబెట్టేలా అధికారుల తీరు కనిపిస్తోంది. ఈ జీజీహెచ్‌పై జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు సైతం దృష్టి సారించకపోవటంతో ప్రజలకు ఆధునిక వైద్య సేవలు దూరం అవుతున్నారు. ప్రభుత్వ ధనం ప్రైవేటు కంపెనీలకు ధారాదత్తం చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. హాస్పిటల్ అభివృద్ధి కమిటీ ఉందో ? లేదో తెలియని సందిగ్ధత నెలకొంది. అభివృద్ధి కమిటీకి చైర్మన్‌గా వ్యవహరించాల్సిన జిల్లా కలెక్టర్ జీజీహెచ్ వైపు చూడకపోవటంతో అధికారులు చెప్పిందే వేదంగా మారింది. ఏలూరు జీజీహెచ్‌లో కరోనా సమయంలో 2020, 21 సంవత్సరాల్లో అప్పటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కరోనా బాధితులకు ఆక్సిజన్ చికిత్సల కోసం యుద్ధప్రాతిపదికన తొలుత ఆక్సిజన్ నిల్వ ప్లాంట్‌ను ఏర్పాటు చేయగా, అనంతరం సొంతంగా జీజీహెచ్‌లో ఆక్సిజన్ ఉత్పత్తి ప్లాంట్లను ఏర్పాటు చేసింది. కేంద్రం రూ.2.50 కోట్లు నిధులు వెచ్చించగా, మరో ప్రైవేటు సంస్థ స్వచ్ఛందంగా ఆక్సిజన్ ఉత్పత్తి ప్లాంట్ ఏర్పాటుకు కొంత సొమ్ము వెచ్చించింది. సుమారుగా 5,500 కిలో లీటర్ల లిక్విడ్ ఆక్సిజన్ ఉత్పత్తి చేసేలా ప్లాంట్స్ నిర్మించారు.



ఏలూరు జీజీహెచ్‌లో ప్రైవేటు కంపెనీ ఆక్సిజన్ నిల్వ చేసే ట్యాంక్

కరోనా ముమ్మరంగా ఉన్న రోజుల్లో ప్లాంట్స్ ద్వారా ఆక్సిజన్ ఉత్పత్తి చేస్తూ వినియోగించారు. అనంతరం ఈ ప్లాంట్స్‌ను పట్టించుకునే నాథుడే లేక నిరుపయోగంగా మారిపోయాయి.

ప్రైవేటు కంపెనీకి లక్షల చెల్లింపులు

ఏలూరు జీజీహెచ్‌లో కంటి వైద్య విభాగం పక్కనే కరోనా సమయంలో సుమారు 10 వేల కిలో లీటర్ల లిక్విడ్ ఆక్సిజన్ నిల్వ చేసే భారీ ప్లాంట్ ఏర్పాటు చేశారు. కరోనా కాలంలో రెండు రోజులకు ఒకసారి లిక్విడ్ ఆక్సిజన్ సరఫరా చేసేలా లిండే కంపెనీతో ఒప్పందం చేసుకున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో భారత్ కంపెనీకి బాధ్యతలు అప్పగించారు. వారం, 10 రోజులకు ఒకసారి ఈ ట్యాంకును నింపేలా చర్యలు చేపట్టారు. ఏలూరు జీజీహెచ్ ఆక్సిజన్ సరఫరాకు ప్రతినెలా రూ.3 లక్షల నుంచి రూ.5లక్షల వరకు ఖర్చు చేస్తోంది. ఇంత భారీ మొత్తంలో ఆక్సిజన్ కోసం ప్రజా ధనం వృథాధా చేస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.



ఏలూరు జీజీహెచ్‌లో నిరుపయోగంగా ప్రభుత్వ ఆక్సిజన్ ఉత్పత్తి ప్లాంట్

పట్టించుకోని అధికారులు

ఏలూరు జీజీహెచ్‌లో ఎమర్జెన్సీ, ట్రామాకేర్, ఎంసీహెచ్ ఇలా అన్ని విభాగాల్లోనూ సుమారుగా 620 ఆక్సిజన్ బెడ్లు ఉన్నాయి. ఈ ఆక్సిజన్ బెడ్లకు నేరుగా ప్లాంట్ల నుంచి ఆక్సిజన్ సరఫరా చేసేలా పైప్‌లైన్ వేశారు. ఇక సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆక్సిజన్ ఉత్పత్తి ప్లాంట్లను పనిచేసేలా చేస్తే ప్రైవేటు కంపెనీలకు డబ్బులు చెల్లించాల్సిన అవసరం ఉండదనే అభిప్రాయం ఉంది. ఏలూరు జీజీహెచ్‌లో పూర్తిస్థాయిలో ఎలాగూ ఆక్సిజన్ బెడ్లు వినియోగించే పరిస్థితి లేకపోవటంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉత్పత్తి ప్లాంట్లనే వినియోగించుకునే ప్రజా ధనం వృథా కాదని అంటున్నారు.

టెక్నీషియన్లను నియమించాలి



ఏలూరు సర్వజన ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన రీతిలో సేవలు అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలి. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆక్సిజన్ ఉత్పత్తి ప్లాంట్‌ను వినియోగించుకుంటే ప్రజా ధనం ఆదా చేసుకునే అవకాశం ఉంటుంది. ఇద్దరు టెక్నీషియన్లను నియమించి, మరమ్మతులు నిర్వహించి వినియోగించుకుంటే ప్రజలకు ఉపయోగపడతాయి. అధికారులు వీటిపై దృష్టి సారించాలి.

– పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, సాహిత్య అకాడమీ మాజీ చైర్‌పర్సన్

సద్వినియోగం చేయాలి



ఏలూరు జీజీహెచ్‌లో ప్రభుత్వం కోట్లు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన ఆక్సిజన్ ఉత్పత్తి ప్లాంట్లను అధికారులు సద్వినియోగం చేసుకోవాలి. గత కొంతకాలంగా నిరుపయోగంగా వదిలేయటంతో ప్రైవేటు కంపెనీ నుంచి ఆక్సిజన్ కొనుగోలు చేయాల్సిన దుస్థితి వచ్చింది. సొంతంగా జీజీహెచ్ అధికారులే ఆక్సిజన్ ఉత్పత్తి ప్లాంట్లను వినియోగించుకుంటే లక్షలాది రూపాయలు ఆదా చేసుకోవచ్చు. జిల్లా ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించాలి.

– సొంగా మధు, నవ్యాంధ్ర ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకులు

తూనికలు, కొలతల శాఖ అధికారుల తనిఖీలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : తూనికలు, కొలతల శాఖ అధికారులు శనివారం వివిధ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. స్థానిక ఒన్‌టౌన్‌లోని చంద్రశేఖర్ రైస్ మర్చంట్ దుకాణంలో తనిఖీలు నిర్వహించగా, ఆ దుకాణంలో బియ్యం బస్తాలపై ముద్రించిన బరువుకంటే తక్కువ తూకం ఉన్న మూడు బ్రాండ్ల బియ్యం బస్తాలను సీజ్ చేశారు. వీటిలో 999 పూళ్ల పీఎల్, మిస్టర్ వల్లూరి సార్టెడ్ రైస్ పెద్దాపురం, రాజ్ కుమారి బ్రాండ్ మండపేట బ్రాండ్ల బియ్యం బస్తాలపై 26 కేజీలు అని ముద్రించి ఉండగా అధికారుల తనిఖీలో బస్తాలో 25 కేజీలే ఉండడంతో కేసు నమోదు చేశారు. అలాగే భీమడోలు గ్రోమోర్ దుకాణంలో యూనిక్ సేల్ ప్రైస్ ముద్రించి లేని కారణంగా ఆ దుకాణంపై కేసు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో తూనికలు, కొలతల శాఖ ఏలూరు ఇన్‌స్పెక్టర్ వి.ప్రశాంత్ కుమార్, సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్ జి.చంద్రశేఖర్, టెక్నికల్ అసిస్టెంట్లు ఎస్ గణేష్, వి.అప్పారావు పాల్గొన్నారు.



చంద్రశేఖర్ రైస్ మర్చంట్ దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

పవర్ బీఐ నైపుణ్యాలకు అధిక డిమాండ్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విస్తృతశ్రేణి పరిశ్రమల్లో పవర్ బీఐ నైపుణ్యాలకు అధిక డిమాండ్ ఉందని, ఈ శక్తివంతమైన సాధనలో నైపుణ్యం సాధించిన వారికి పుష్కలమైన ఉద్యోగ అవకాశాలు, భద్రత అందిస్తుందని సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సిస్టర్ సుశీల అన్నారు. స్థానిక సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో శనివారం నిర్వహించిన స్టాటిస్టికల్ విజువలైజేషన్ టూల్ పవర్ బీఐ వర్క్‌షాప్‌లో ఆమె మాట్లాడారు. పవర్ బీఐ అనేది వ్యాపార విశ్లేషకులు, నిపుణులు ప్రతిరోజు ఉపయోగించే సాధారణ వ్యాపార మేధస్సు సాధనమన్నారు. విద్యార్థులు విద్యాభ్యాసానంతరం త్వరితగతిన ప్లేస్మెంట్ పొందడానికి ఇది ఒక సరైన సాధనమని తెలిపారు. విజయవాడ స్టాటిస్ ఫెయిర్ సాఫ్ట్వేర్ సొల్యూషన్‌కి చెందిన నిపుణులు డాక్టర్ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ పవర్ బీఐ అనేది స్టాటిస్టికల్ విజువలైజేషన్ టూల్‌ని ఉపయోగించి ఆధారాల నుంచి డేటాను కార్యాచరణకు అనుగుణంగా మార్చడంలో ఉపయోగపడుతుందన్నారు. అదే సంస్థకు చెందిన నిపుణులు షేక్ సైగల్ పవర్ బీఐని ఇంటర్ ఆక్టివ్‌గా ఎలా ఉపయోగించాలో వివరించారు. మ్యాథమెటిక్స్ అండ్ స్టాటస్టిక్స్ హెచ్‌ఓడీ వి.గోపీనాథ్ మాట్లాడుతూ పవర్ బీఐని ఉపాధి అవకాశంగా మలుచుకునేవారు ఉన్నత స్థానాలకు ఎదగడంలో అతిశయోక్తి లేదన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు పి.పూజిత, జి.జ్యోతి, ఆర్ శ్రావణి పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌లో పాల్గొన్న అతిథులు

నేటి నుంచి రెండు విడతలుగా వ్యవసాయ విద్యుత్ సరఫరా

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు డివిజన్ పరిధిలోని 132 కేవీ భీమడోలు – పెదవేగి ఫీడర్‌లో ప్రస్తుతం ఉన్న కండక్టర్‌ను మార్చే నిమిత్తం ఈ నెల 25వ తేదీ నుంచి వివిధ ప్రాంతాల్లో వ్యవసాయానికి సరఫరా చేసే విద్యుత్‌ను రోజుకు రెండు విడతలుగా సరఫరా చేయనున్నట్టు ఈఈ జేపీబీ నటరాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. విజయరాయి, బాపిరాజు గూడెం, అయ్యపరాజు గూడెం, జానంపేట, పెదవేగి, కూచింపూడి, రామసింగవరం, రాయుడు పాలెం, కవ్వగుంట, ఆసన్నగూడెం, ధర్మాజీ గూడెం, ముందూరు, గాలాయగూడెం, చొదిమెళ్ల, తంగెళ్లమూడి, గుడిగుంట, జోగన్నపాలెంలలో సెప్టెంబర్ 3వ తేదీ వరకు ప్రతిరోజూ వ్యవసాయానికి రెండు విడతలుగా విద్యుత్ సరఫరా చేస్తామని, రైతులు ఈ విషయాన్ని గ్రహించి తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. అలాగే భీమడోలు – ఏలూరు ఫీడర్ పరిధిలోని రామారావు గూడెం, దెందులూరు, పూళ్ల, సూరప్పగూడెం, గుండుగొలను ప్రాంతాల్లో సైతం రోజుకు రెండు విడతలుగా విద్యుత్ సరఫరా చేస్తామని పేర్కొన్నారు.

చీటీ పాడినా డబ్బులు ఇవ్వలేదని దాడి

ఏలూరు టౌన్: ఏలూరు రూరల్ ప్రాంతంలో ఒక వ్యక్తి చీటీలు వేస్తూ ఉంటాడు. అతని వద్ద చీటీలు వేసి పాటపాడినా డబ్బులు ఇవ్వకపోవటంతో ఒక మహిళ, అతని మేనల్లుడు అతనిపై దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదుతో ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఏలూరు జయప్రకాష్‌నగర్ ప్రాంతానికి చెందిన బుంగా గంగాధరరావు ఆదే ప్రాంతంలోని 10 మంది వ్యక్తులను కలుపుకుని చిటీలు వేశాడు. వారిలో ఇద్దరు చనిపోగా వారి చీటీలు కూడా మిగిలిన వారే కడుతున్నారు. చీటీ పాటలు పాడుకున్న వారికి సైతం డబ్బులు ఇవ్వకుండా నెలల తరబడి కాలయాపన చేస్తూ ఉండడంతో బాధితులు రోజూ అతడ్ని అడుగుతూ వస్తున్నారు. గంగాధర్ సరైన సమాధానం ఇవ్వకపోవటంతో శనివారం అరుణమ్మ, ఆమె మేనల్లుడు అతనిపై రాడ్డుతో దాడి చేశారు. బాధితుడు గంగాధర్ ఫిర్యాదుతో ఏలూరు రూరల్ పోలీసులు వారిపై కేసు నమోదు చేశారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ముగ్గురు భక్తులు వేరువేరుగా శనివారం రూ.3,13,348 విరాళంగా అందజేశారు. ఏలూరుకు చెందిన కలగర రత్న సంపత్ రూ.1,11,116, భీమవరంకు చెందిన కలిదిండి రామచంద్రరాజు రూ.1,01,116, నిడమర్రు మండలం భువనపల్లికి చెందిన శంకు వీరవెంకట దుర్గాప్రసాద్ రూ.1,01,116 ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు, సూపరింటెండెంట్ రమణరాజు విరాళం బాండ్ పత్రాలను అందించారు. దాత కుటుంబాలకు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు.

28న విజయవాడలో భూ బాధితుల సదస్సు

ఏలూరు (టూటౌన్): ఈ నెల 28వ తేదీన విజయవాడలో జరిగే భూ బాధితుల రాష్ట్ర సదస్సు పోస్టర్‌ను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ స్థానిక స్ఫూర్తి భవన్‌లో శనివారం విడుదల చేశారు. ప్రభాకర్ మాట్లాడుతూ పేదలకు దక్కిన, దక్కాల్సిన భూములను బడా నాయకులు ఆక్రమించుకున్నారని ఆరోపించారు. దశాబ్దాల తరబడి పేదలు ప్రభుత్వ భూములు సాగు చేసుకుంటున్నా పట్టాల పంపిణీ చేయడంలేదని తెలిపారు. ఏలూరు జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న పోలవరం నియోజకవర్గంలో కుక్కునూరు, వేలేరుపాడు, బుట్టాయగూడెం మండలాల్లో 25 సంవత్సరాలుగా పేదలు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు మంజూరు చేసి పంపిణీ చేయాలని ప్రభాకర్ కోరారు. సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య మాట్లాడుతూ పోలవరం, నూజివీడు, చింతలపూడి నియోజకవర్గాల్లో పోరాడి సాధించుకున్న భూములకు పట్టాలు పంపిణీ చేయాలని కోరారు. వన సంరక్షణ సమితిలోని సభ్యులందరికీ హక్కు పత్రాలు ఇవ్వాలన్నారు. భూ పోరాటాల్లో పాల్గొన్న కమ్యూనిస్టులపై ఉన్న కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అటవీ బంజరు భూములను సాగు చేసుకుంటున్న పేదలంతా సదస్సుకు హాజరకావాలని కోరారు. సీపీఐ నాయకులు పుప్పాల కన్నబాబు, ఉప్పులూరి హేమశంకర్, ఏఐటీయూసీ కార్యదర్శి కడుపు కన్నయ్య, బళ్ల కనకదుర్గారావు, కనకం జగన్, తెర్లాపు శ్రీను పాల్గొన్నారు.



భూ సదస్సు పోస్టర్ విడుదల చేసిన నాయకులు

26న కృష్ణాష్టమి వేడుకలు

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగర యాదవ సంఘం, ఇస్కాన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 26న శ్రీ కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించనున్నట్టు జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు ముమ్మిడి చింతయ్య తెలిపారు. ఈ మేరకు స్థానిక అమీనాపేట ఏటిగట్టు ప్రాంతంలో ఉన్న జిల్లా యాదవ సంఘం కార్యాలయంలో శనివారం కరపత్రం విడుదల చేశారు. ఈనెల 26న ఉదయం 7 గంటలకు సంఘం భవన్‌లో పూజలు, సాయంత్రం నాలుగు గంటల నుంచి రామకోటి ప్రాంగణంలో 108 కలశాలతో పంచామృతాభిషేకం, 108 కేజీల పుష్పాలతో పుష్పాభిషకం, 108 రకాల ప్రసాదాలతో నైవేద్యం సమర్పిస్తామని వివరించారు. ఈ సందర్బంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు, చిన్నారుల వేష ధారణ, భగవద్గీత పోటీలు, శ్రీ కృష్ణ తత్వంపై ప్రవచనం, కీర్తనలు, భజనలు వంటి కార్యక్రమాలు ఏర్పాటుచేశామన్నారు. రాత్రి 7 గంటలకు ఉట్టి కొట్టే కార్యక్రమం ఉంటుందని, మొదటి బహుమతిగా రూ.10,116, ద్వితీయ బహుమతిగా రూ.5,116 ఇస్తామని వివరించారు. కార్యక్రమంలో ఇస్కాన్ టెంపుల్ రాధా వల్లభా, ఇసుకపల్లి తాతారావు, కాట్రు బాలు, మెరుగమాల శ్రీనివాసరావు, కిలారపు జగదీష్, మల్లిపూడ రాజు, కొమ్మ నాగరాజు, దుర్గా శ్రీనివాసరావు, డొక్కు మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



శ్రీ కృష్ణాష్టమి వేడుకల కరపత్రం విడుదల చేస్తున్న నాయకులు

విద్యుత్ స్మార్ట్ మీటర్ల ప్రక్రియ నిలిపివేయాలి

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలో వ్యవసాయ పంపుసెట్లకు, నివాస గృహాలకు విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ఆదేశాలకు లొంగి విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపుకు ప్రభుత్వాలు పూనుకున్నాయని ఆరోపించారు. అదానీ, షిర్డీ సాయి తదితర కంపెనీలకు కాంట్రాక్టులను కట్టబెట్టారని ఇందులో పెద్ద ఎత్తున అవినీతి చోటు చేసుకుందని ఆరోపించారు. టీడీపీ ప్రతిపక్షంలో ఉండగా ఈ మీటర్లను వ్యతిరేకించిందని, హైకోర్టులో పిటీషన్లు వేశారని, నేడు టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఒప్పందాలను రద్దు చేయకపోగా స్మార్ట్ మీటర్ల ప్రక్రియను కొనసాగించడం ఏమిటని రవి ప్రశ్నించారు. విజయవాడతో సహా పలు ప్రాంతాల్లో అదానీ సంస్థకు చెందిన మీటర్లను తెచ్చి విద్యుత్ కార్యాలయాల్లో భద్రపరుస్తున్నారని, వ్యవసాయ పంపు సెట్లకు, ప్రభుత్వ కార్యాలయాల్లోనూ మీటర్లు బిగిస్తున్నారని, తదుపరి నివాస గృహాలకు మీటర్లు బిగించే ప్రక్రియకు సిద్ధమవుతున్నారని వివరించారు. వేలాది కోట్ల రూపాయలు ప్రజాధనం మీటర్ల పేరుతో దుర్వినియోగం చేస్తున్నారని, టీడీపీ కూటమి ప్రభుత్వం మాట తప్పి కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు లొంగిపోయిందని ఆరోపించారు. స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియను నిలిపివేయాలని రవి డిమాండ్ చేశారు.

దోమల నివారణ చర్యలు

ఏలూరు (టూటౌన్) : దోమల నివారణకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మాలతి తెలిపారు. సీజనల్ వ్యాధులు రాకుండా మలేరియా విభాగం వారితో కలిసి స్థానిక 30వ డివిజన్ పరిధిలోని మంచినీళ్ల తోట, ఏటిగట్టు, మోతేవారి తోట తదితర ప్రాంతాల్లో దోమల నివారణ చర్యలు చేపట్టామన్నారు. దోమల లార్వా నిర్మూలనకు స్ప్రేయింగ్, మురుగు కాలువ కల్వర్టు కింద ఫాగింగ్, ఖాళీ స్థలాల్లో ఉన్న నిలువ నీటిలో ఆయిల్ బాల్స్ వేయించామని తెలిపారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికుల మస్టర్ పాయింట్లను తనిఖీ చేశారు. పలు డివిజన్లలో తిరిగి పారిశుధ్య పనులు, డ్రెయినేజీ వ్యవస్థను పర్యవేక్షించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పప్పు ఉమా మహేశ్వరరావు, మలేరియా ఇన్‌స్పెక్టర్ దత్తి వేణు గోపాల్‌స్వామి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కె.స్టీఫెన్ రాజు, ఆరోగ్య కార్యదర్శి, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



డ్రెయినేజీని పరిశీలిస్తున్న డాక్టర్ మాలతి

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక సత్రంపాడు సౌభాగ్యలక్ష్మి ఆలయ వార్షికోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం మహాలక్ష్మి మూలమంత్ర హోమం, మధ్యాహ్నం ఆలయ శిఖర కుంభాభిషేకం, పూర్ణాహుతి నిర్వహించారు. భక్తులు అన్న సమారాధన ఏర్పాటుచేశారు.

7 నుంచి నవరాత్రి మహోత్సవాలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక సత్రంపాడు లక్ష్మీ గణపతి స్వామి ఆలయంలో సెప్టెంబర్ 7 నుంచి 16వ తేదీ వరకు 26వ గణపతి నవరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి సీహెచ్ చిన నాగేశ్వరరావు తెలిపారు. శనివారం ఆలయ ప్రాంగణంలో ఉత్సవాల కరపత్రం విడుదల చేశారు. అర్చకుడు ఆర్ రాఘవేంద్రకుమార్ శర్మ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి వందే భారత్‌కు ఏలూరులో హాల్ట్

ఏలూరు (టూటౌన్): విశాఖపట్టణం – సికింద్రాబాద్ మధ్య నడిచే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలుకు ఈనెల 25వ తేదీ నుంచి ఏలూరులో అదనపు హాల్ట్ కల్పించనున్నారు. ఆదివారం సాయంత్రం 5.15 గంటలకు విశాఖ పట్టణం నుంచి బయలు దేరే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ఏలూరుకు రానుంది. ఈ సందర్భంగా ప్రారంభోత్సవ వేడుకకు రైల్వే అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తోపాటు రైల్వే అధికారులు, ప్రజలు పాల్గొననున్నట్టు విజయవాడ డివిజన్ దక్షిణ మధ్య రైల్వే అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

కత్తితో వ్యక్తి హల్‌చల్

ఏలూరు టౌన్: ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలోని అన్నా క్యాంటీన్ వద్ద శనివారం రాత్రి ఒక వ్యక్తి కత్తితో హల్‌చల్ చేశాడు. అన్నా క్యాంటీన్ వద్దకు భోజనం చేసేందుకు వచ్చిన వారంతా భయంతో పరుగులు పెట్టారు. వెంటనే స్పందించిన ఏలూరు వన్‌టౌన్ పోలీసులు అతడ్ని అదుపులోకి తీసుకున్నారు. వన్‌టౌన్ సాయిబాలాజీ థియేటర్ సమీపంలో ఉన్న అన్నా క్యాంటీన్ వద్ద నందమూరు గాబ్రియేల్ అనే మతిస్థితిమితం లేని వ్యక్తి హడావుడి చేశాడు. అతను భోజనం చేసేందుకు అన్నా క్యాంటీన్ వద్దకు రాగా, భోజనం లేదని చెప్పటంతో కోపంతో అతను కత్తితో హల్‌చల్ చేశాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వటంతో అతడ్ని అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. అతను మతిస్థిమితం లేకపోవటంతో ఇటీవల ఇదే విధంగా హడావుడి చేస్తున్నట్టు స్థానికులు చెబుతున్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

ఏలూరు టౌన్: ఏలూరు శివారు ఆటోనగర్‌లో ఇటీవల ఒక యువకుడు లారీ డిస్కులను చోరీ చేశాడు. తండ్రి మందలించటంతో అతను తిరిగి వాటిని తీసుకువెళ్లి వారికే ఇచ్చేశాడు. ఈ నేపథ్యంలో ఘటనా స్థలంలో కొందరు వ్యక్తులు యువకుడ్ని కులం పేరుతో దూషించి, కొట్టటంతో యువకుడి ఫిర్యాదు మేరకు ఏలూరు రూరల్ పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఏలూరు లంకపేటకు చెందిన మరకాల దినేష్ రెండు రోజుల క్రితం ఆటోనగర్‌లో లారీ డిస్కులను చోరీ చేశాడు. ఈ విషయం తెలిసిన తండ్రి దినేష్‌ను మందలించాడు. చోరీ చేసి సొత్తును తిరిగి అక్కడే పెట్టేశాడు. అతడ్ని పట్టుకున్న అక్కడి ఆటోనగర్‌లోని వ్యక్తులు కులం పేరుతో దూషించటంతో వారిపై కేసు నమోదు చేశారు.